డివైడర్ నిర్మాణం కలేనా..?

- దశాబ్ద కాలంగా నిలిచిన పనులు
- ప్రమాదాలబారిన వాహన చోదకులు
- హామీలకే పరిమితమైన సెంట్రల్ లైటింగ్


డివైడర్ కోసం వదిలేసిన స్థలం


లింగంపేట సింగిల్ విండో సమీపంలో డివైడర్ కోసం వదిలిన స్థలంలో ఏర్పడిన గుంతలు

లింగంపేట(ఎల్లారెడ్డి): దశాబ్ద కాలంగా లింగంపేట మండల కేంద్రంలోని డివైడర్ పనులు కలగానే నిలిచిపోయాయి. మండల కేంద్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్న పాలకులు పట్టించుకున్న పాపాన పోవడంలేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సౌకర్యార్థం మండల కేంద్రంలోని స్థానిక అంబేడ్కర్ చౌరస్తా నుంచి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వరకు డబుల్ సీసీ రోడ్డు నిర్మించారు. సీసీ రోడ్డు నిర్మాణ సమయంలో మధ్యలో డివైడర్ కోసం స్థలం వదిలేశారు. డివైడర్ కోసం స్థలం వదిలి తొమ్మిదేళ్లు గడుస్తున్నా నేటి వరకు డివైడర్ పనులు చేపట్టకపోవడంతో ప్రజలు మండిపడుతున్నారు. వదిలేసిన స్థలంలో గుంతలు ఏర్పడి వాహన చోదకులకు ఇబ్బందిగా మారింది. వర్షాకాలంలో గుంతలు ఏర్పడి పలువురు వాహనాలు అదుపు తప్పి పడిపోయి గాయాలపాలవుతున్నారు. పాలకులు, అధికారులకు గ్రామస్తులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందించకపోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా ఉందని మండల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వేలాది మంది తిరిగే ప్రధాన రోడ్డులో ఇలాంటి సమస్యలు ఉంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలు వచ్చిన సమయంలో ప్రతి నాయకుడు ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ప్రజలకు హామీలు ఇస్తున్నారే తప్ప ఆచరణలో పెట్టడంలేదని విమర్శిస్తున్నారు. మండల కేంద్రంలో దశాబ్ద కాలంగా డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని చెప్పడమే తప్ప ప్రజల సమస్యలు తీర్చే నాయకులు కరువయ్యారని చెబుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ఎన్నికల్లో హస్తం జెండా ఎగరాలి


అచ్చంపేట నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే


పంచాయతీరాజ్ అధికారులతో సమీక్షిస్తూ..

- కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలి
- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): రానున్న పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో హస్తం జెండా ఎగురవేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. శనివారం సాయంత్రం అచ్చంపేట అతిథి గృహంలో నిజాంసాగర్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు ఎళ్లవేళలా రుణపడి ఉంటానన్నారు. కార్యకర్తలు, నాయకుల మధ్య మనస్పర్థలు లేకుండా అందరూ కలిసికట్టుగా ఉండాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ఏలె మల్లికార్జున్, నాయకులు అడ్వొకేట్ రాంరెడ్డి, చీకొటి మనోజ్ పటేల్, తదితరులు న్నారు.

వసతి గృహాల అభ్యున్నతికి కృషి

నిజాంసాగర్(జుక్కల్): ఎస్సీ ఎస్టీ మైనార్టీ బీసీ సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలు, శిథిలావస్థకు చేరుకున్న భవనాల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అన్ని మండలాల పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రణాళికలు సిద్ధం చేస్తే, సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. పెండింగ్ పనులను పూర్తి చేయించి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలన్నారు.

క్లుప్తంగా

నియామకం



పిట్లం(జుక్కల్): కాంగ్రెస్ పార్టీ జుక్కల్ నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మన్‌గా సౌదాగర్ అరవింద్ నియమితులయ్యారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం చైర్మన్ రాజేష్ లిలోతియా నియామక పత్రాన్ని సౌదాగర్ అరవింద్‌కు ఢిల్లీలో అందజేశారు. ఈ సందర్భంగా అరవింద్‌కు పలువురు శుభకాంక్షలు తెలిపారు.

కళాశాలకు ఇద్దరు లెక్చరర్లు..

బీబీపేట: బీబీపేట మండల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఇద్దరు లెక్చరర్లను నియమిస్తూ ప్రభుత్వం ప్రకటన చేసిందని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శంకర్ శనివారం తెలిపారు. గత సంవత్సరం ప్రారంభించిన జూనియర్ కళాశాలకు ఇంగ్లిష్, రసాయన శాస్త్రం అధ్యాపకులను ప్రభుత్వం కేటాయించింది అని పేర్కొన్నారు. ఇంటర్‌లో అడ్మిషన్లు తీసుకోవడానికి ఈ నెల 15 వరకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా అవకాశం ఉందని తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



నస్రుల్లాబాద్(బాన్సువాడ): దుర్కి గ్రామంలో స్వచ్ఛంద సేవా సంస్థ సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో పొదుపు ఏవిధంగా చేసుకోవాలి..బ్యాంకులలో అందించే సేవలు, సైబర్ నేరాలపైన అవగాహన, జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కళాజాత బృందం, కౌన్సెలర్లు బాలకృష్ణ, పర్వయ్య, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి గిరిజన బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని సింధు జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సావిత్రి శనివారం తెలిపారు. రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు నారాయణపేటలో జరగగా అక్కడ గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికై నట్లు ఆమె తెలిపారు. సింధును ఉపాధ్యాయులు అభినందించారు.

వడ్డీ వ్యాపారుల ఇళ్లలో పోలీసుల సోదాలు



ఎల్లారెడ్డి: పట్టణంలో వడ్డీ వ్యాపారుల ఇళ్లలో సోదాలు నిర్వహించినట్లు ఎస్సై మహేష్ శనివారం తెలిపారు. పట్టణంలోని పలువురు వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు వడ్డీ వ్యాపారుల ఇళ్లలో సోదాలు నిర్వహించినట్లు చెప్పారు. వారి వద్ద ఎలాంటి పత్రాలు లభ్యం కాలేదని ఎస్సై తెలిపారు.

వైకుంఠ రథం విరాళం



భిక్కనూరు: భారతీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భిక్కనూరు జీపీకి రూ.2.30 లక్షలతో తయారు చేయించిన వైకుంఠరథాన్ని శనివారం అందజేశారు. భారతీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు న్యాయవాది లింగాల రాజబాబుగౌడ్ తన తాతయ్య–నానమ్మల శివరాజగౌడ్– గాలమ్మల జ్ఞాపకార్థం రథాన్ని కార్యదర్శికి అందజేశారు. నేతలు అందే దయాకర్‌రెడ్డి, సుబ్బారావు,గంగాగౌడ్, బసగల్ల సిద్దరాములు, దాత కుటుంబీకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అమరవీరులకు నివాళులు



కామారెడ్డి టౌన్: ఆర్టీసీ అమరవీరుల స్మరించుకుంటూ శనివారం కామారెడ్డి ఆర్టీసీ డిపో ముందు జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు, కార్మికులు అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, రెండు నిమిషాల పాటు మౌనం పాటించి, నివాళులర్పించారు. జేఏసీ నాయకులు రమేష్, ఖాదీర్, కృష్ణమూర్తి, సీతారాములు, క్రాంతి, వి.డి.దాస్, బుచ్చిరెడ్డి, బాలయ్య పాల్గొన్నారు.

పంటల సాగులో మెలకువలు పాటించాలి


అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): పంటల సాగులో రైతులు మెలకువలు పాటించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ, వ్యవసాయ కళాశాల(రాజేంద్ర నగర్)లో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు పేర్కొన్నారు. శనివారం శిక్షణలో భాగంగా సదాశివనగర్‌ను సందర్శించినట్లు తెలిపారు. ముందుగా విద్యార్థులు గ్రామంలో సర్వే నిర్వహించి సమాచారాన్ని సేకరించారు. అనంతరం గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద రైతులతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. మాల్తుమ్మెద ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రేవంత్ నాథన్, ఏఈవోలు కవిత, శ్రీనివాస్ నాయక్, మాజీ సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శి మాధవిలత, విండో చైర్మన్ కమలాకర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో పూజలు



బాన్సువాడ: బీర్కూర్ మండలం తిమ్మాపూర్ వేంకటేశ్వర ఆలయంలో శనివారం బాన్సువాడ, జుక్కల్ ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీకాంతారావు, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో చేసిన అభివృద్ధిని జుక్కల్ ఎమ్మెల్యేకు వివరించారు. పోచారంను జుక్కల్ ఎమ్మెల్యే సన్మానించారు. బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల నాయకులు ఉన్నారు.

హెచ్ఐవీపై అవగాహన సదస్సు



దోమకొండ: మండల కేంద్రంలోని టెలిఫోన్ బీడీ కంపెనీలో హెచ్ఐవీపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్ఐవీ ఏవిధంగా వ్యాపిస్తుంది.. దానిని ఏవిధంగా అరికట్టాలి.. ఎలాంటి మందులు వాడాలి..ఎక్కడ దొరుకుతాయి అనే విషయాలపై కామారెడ్డి జీజీహెచ్ ఐసీటీసీ కౌన్సెలర్ మ్యాక నాగరాజు వివరించారు. కార్యక్రమంలోటెలిఫోన్ బీడీ కంపెనీ సంస్థ మేనేజర్ శైలేష్ కుమార్ పటేల్, అసిస్టెంట్ మేనేజర్ హితేష్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు


ఎల్లారెడ్డి: శ్రీరామసేన దుర్గామాత మండలి వద్ద చండీహోమం చేస్తున్న భక్తులు


అడివిలింగాలలో..


ఎల్లారెడ్డి రూరల్: శాకాంబరి దేవిగా..

జిల్లాలో దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మండపాల్లో కొలువుదీరిన అమ్మవారిని ఒక్కోరోజు ఒక్కో అవతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. శనివారం పలు చోట్ల భక్తులు అమ్మవారిని గాయత్రిదేవిగా, అన్నపూర్ణాదేవిగా, శాకాంబరిదేవిగా అలంకరించి పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించి తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. పలు చోట్ల అన్నదానం చేశారు. చండీహోమాలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్


బాన్సువాడలో గాయత్రి దేవిగా సరస్వతి దేవి


దేవునిపల్లిలో దుర్గామాత మండపం వద్ద..


ఇస్సానగర్‌లో మండపాల నిర్వాహకులకు ఎమ్మెల్యే కేవీఆర్ అందజేసిన చీరలను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు


దేశాయిపేట్‌లో పూజలందుకుంటున్న దుర్గామాత


మద్నూర్‌లో దాండియా ఆడుతున్న మహిళలు

నిధులు విడుదల చేయాలి



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ శనివారం కలిశారు. హైద్రాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో నిలిచిన పనులను తిరిగి కొనసాగించేలా నిధులను విడుదల చేయాలని ఆయన కోరారు. స్పందించిన ఎమ్మెల్యే నిధులను మంజూరు చేయించి మున్సిపల్ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. కౌన్సిలర్ నీలకంఠం, కాంగ్రెస్ నాయకులు విద్యాసాగర్, నునుగొండ శ్రీనివాస్, పోచయ్య, రమేష్ తదితరులున్నారు.

అరవింద్‌ను నియమించడం సరికాదు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మన్‌గా సౌదాగర్ అరవింద్‌ను నియమించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఎస్సీ సెల్ చైర్మన్‌గా అరవింద్‌ను నియమిస్తూ ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం చైర్మన్ రాజేష్ లిలోతియా తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో ఆయన పార్టీకి వ్యతిరేకంగా పని చేశారని, అలాంటి వ్యక్తికి పదవి ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. నాయకులు నాగిరెడ్డి, శామప్ప పటేల్, మల్లప్ప పటేల్, పండరి, సంజీవ్ పాల్గొన్నారు.

డ్రైయినేజీపై ఇనుప జాలీ ఏర్పాటు



రాజంపేట: మండల కేంద్రంలోని గాంధీకాలనీలో మినీ వాటర్ ట్యాంక్ వద్ద నీళ్ల పట్టుకునేందుకు స్థానికులు ఇబ్బందులు పడుతుండంతో సాక్షిలో శనివారం 'నీళ్ల పట్టుకునే దారేది?' శీర్షికతో వార్తా కథనాన్ని ప్రచురించారు. ఈ కథనానికి జీపీ కార్యదర్శి అశోక్ స్పందించారు. ఆ డ్రైనేజీపై ఇనుప జాలీ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వోగా ఉమేష్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వోగా ఏఎస్సై ఉమేష్‌కు ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగించారు. నాగిరెడ్డిపేట ఎస్సై మల్లారెడ్డి వ్యక్తిగత కారణాలతో వారంరోజులపాటు సెలవుపై వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఏఎస్సై ఉమేశ్‌కు ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వో బాధ్యతలు అప్పగించారు.

గల్ఫ్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



రామారెడ్డి: గల్ఫ్ దేశాలలో తెలంగాణ ప్రాంత కార్మికులు అందులోనూ కామారెడ్డి, ఎల్లారెడ్డి ప్రాంత వాసులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని గల్ఫ్ సంఘం రామారెడ్డి మండల అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, బహ్రెయిన్ దేశంలో పర్యటిస్తున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి గల్ఫ్ దేశాల్లో ఎలాంటి కారణంతో చనిపోయినా ఆ కుటుంబాలకు రూ.5 లక్షలు అందిస్తామని జీవో విడుదల చేయడం హర్షణీయమన్నారు.

ప్రమాదబీమా చెక్కు అందజేత



నిజాంసాగర్(జుక్కల్): నర్సింగ్‌రావ్‌పల్లి గ్రామానికి చెందిన బొట్ల గంగారాంకు శనివారం జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే రూ.2 లక్షల ప్రమాదబీమా చెక్కును అందజేశారు. గంగారాం కుమారుడు బిట్ల పండరి మూడు నెలల కిందట జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. బీఆర్ఎస్ సభ్యత్వం ఉండటంతో పార్టీ తరఫున రూ.2 లక్షల బీమా చెక్కు వచ్చింది. ఈ మేరకు వచ్చిన చెక్కును మృతుడి తండ్రి గంగారాంకు అందేశారు. నాయకులు దుర్గారెడ్డి, గైని విఠల్, రమేష్ గౌడ్, పండరి, విఠల్‌రెడ్డి తదితరులున్నారు.

'అమ్మ ఆదర్శ' పనుల నిధులు విడుదల చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న టీపీటీఎఫ్ నేతలు

కామారెడ్డి టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన పనులకు నిధులు విడుదల చేయాలని తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో శనివారం డీఈవో ఎస్.రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ మాట్లాడుతూ.. సొంత నిధులతో పనులు పూర్తి చేసినా కేవలం 25 శాతం నిధులు మాత్రమే అడ్వాన్స్‌గా ఇచ్చారన్నారు. నాలుగు నెలలు గడిచినా మిగతా నిధులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇంజనీరింగ్ విభాగం నుంచి ఎంబీ రికార్డులు రాకపోవడంతో ఆలస్యమవుతోందని, త్వరలోనే బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని డీఈవో హామీ ఇచ్చారు.జిల్లా కార్యదర్శి సీహెచ్ లింగం ఉన్నారు.

కొనసాగుతున్న బతుకమ్మ సంబురాలు


జిల్లా కేంద్రంలోని సాందీపని కళాశాలలో సంబురాలు


ఆర్‌కే కళాశాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

జిల్లాలో బతుకమ్మ సంబురాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈసందర్భంగా పలు కళాశాలల్లో శనివారం విద్యార్థులు, అధ్యాపకులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి బతుకమ్మ ఆడారు. అనంతరం స్థానిక చెరువులలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. – సాక్షి నెట్‌వర్క్


బాన్సువాడలోని రేణుక వొకేషనల్ కళాశాలలో..


తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ..


ఎస్ఆర్‌కే కళాశాలలో..


భిక్కనూరులో బతుకమ్మలతో మహిళలు


సదాశివనగర్ జూనియర్ కళాశాలలో..

సంక్షిప్తం

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



కామారెడ్డి టౌన్: జిల్లా నిరుద్యోగ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా వరద బాధితుల సహాయార్థం జిల్లాలో సేకరించిన విరాళాల డబ్బులను శనివారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి కళాకారులు అందజేశారు. నాలుగు రోజుల పాటు సేకరించిన రూ. 23,850 లను ఖమ్మం వరద బాధితులకు కోసం సీఎం సహాయనిధికి జమ చేయాలని షబ్బీర్ అలీని కళాకారులు కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సొంటెం సాయిలు, తదితరులున్నారు.

బల్దియా కార్యాలయంలో వెంకటస్వామి జయంతి

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో జి. వెంకటస్వామి(కాక) జయంతిని శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, కమిషనర్ సుజాత, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లయ్యపల్లిలో నర్సరీ పరిశీలన

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మల్లయ్యపల్లిలో నర్సరీని శనివారం ఎంపీవో ప్రకాష్ పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కార్యదర్శి రాజుకి సూచించారు. అన్నారు.

శెట్పల్లిలో పారిశుధ్య పనులు..

లింగంపేట(ఎల్లారెడ్డి): శెట్పల్లిలో శనివారం పారిశుధ్య పనులను ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. కాలనీల్లో ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. పంచాయితీ కార్యదర్శి, సిబ్బంది ఉన్నారు.

విరాళం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీ అంగన్‌వాడీ సెంటర్‌కు లయన్స్ క్లబ్ వివేకానంద ఆధ్వర్యంలో రూ.10వేల విరాళాన్ని శనివారం అందజేశారు. సెంటర్‌లో చిన్నారులకు సృజనాత్మకతను పెంపొందించడానికి గోడలపై సందేశాత్మక చిత్రాల పెయింటింగ్ వేసేందుకు ఈ డబ్బులు అందజేసినట్లు క్లబ్ అధ్యక్షుడు మారుతి తెలిపారు. అంగన్‌వాడి టీచర్ సుజాత, ప్రతినిధులు కృష్ణహరి, రామాంజనేయులు, సంతోష్, శ్రీనివాస్, శేఖర్, లక్ష్మీపతి ఉన్నారు.

చండీ హోమం

భిక్కనూరు: లోకకల్యాణార్థం మాజీ సర్పంచ్ తున్కి వేణు–ప్రత్యూష దంపతుల ఆధ్వర్యంలో శనివారం చండీ హోమం నిర్వహించారు. అనంతరం ప్రజలకు పెద్ద ఎత్తున ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

సుదర్శన హోమం

మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్రం సందర్భంగా శనివారం సుదర్శన నరసింహ హోమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, ఈవో శ్రీధర్ పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీవో నరేష్ తెలిపారు. 41 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు గుర్తించాలన్నారు. రికార్డులు అప్‌డేట్‌గా ఉంచాలన్నారు. ఎంపీవో మలహరి, తదితరులున్నారు.